
AVM

అమావాస్య రాత్రి. పది గంటలు దాటింది. వరుసగా రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షం ఆ పూటే కాస్తంత తగ్గింది. చిన్న చిన్న జల్లులు వస్తూ, పోతూ ఉన్నాయి. పగలంతా కోలాహలంగా ఉన్న విశాఖ బస్టాండు మౌనంగా ఉంది. ఒకటీ అరా మనుషులు వస్తూ పోతూ ఉన్నారు. ఒకటీ అరా బస్‌లు వస్తూ పోతూ ఉన్నాయి. ప్యాసింజర్ బస్‌లు తిరిగే టైమ్ అయిపోయింది కాబట్టి పాసింజర్లు కూడా అంతగా లేరు. ఎవరున్నా లేకున్నా నేను నా డ్యూటీ చేయకతప్పదు కదా!

కంట్రోలర్ క్యాబిన్‌లో కూర్చున్నాను. వార్తా పత్రిక తిరగేస్తున్నాను. బస్ రాగానే కండక్టర్ రిపోర్ట్ తీసుకోవడం, పాసింజర్లకు అవసరమైన ఇన్ఫర్మేషన్ ఇవ్వడం నా డ్యూటీ. గుంటూరుకు బస్ ఉందాండి? ఎవరో ప్యాసింజర్ అడిగాడు. 11.30 కి, 1 గంటకూ... చెప్పాను. ఎందుకో అసహనంగా ఉంది. క్యాబిన్‌లో నుంచి ఇవతలకు వచ్చాను. బైటంతా చీకటిగా ఉంది. ఒక్క బస్టాండులోనే నియాన్ లైట్ల కాంతి ఉంది. అంతా నిశ్శబ్దంగా ఉంది. కొంతమంది లాస్ట్ బస్ తప్పిన ప్యాసింజర్లు సిమెంట్ దిమ్మల మీద నిద్రపోతున్నారు. కొందరు కళ్ళు మూస్తూ తెరుస్తూ తమ సామాను వైపు చూసుకుంటున్నారు. ఒకటీ అరా అటూ ఇటూ తిరుగుతున్నారు.

"అనకాపల్లికి బస్ ఎన్ని గంటలకండీ? ఒక స్త్రీ కంఠస్వరం వినబడే సరికి వెనక్కి తిరిగి చూసాను.

"అనకాపల్లికి బస్సుందాండీ?" అన్నదామె మరలా

"ఉందండీ" అన్నాను నేను.

"నేను అనకాపల్లి దాటాక ఆ తరువాత స్టేజిలో దిగాలండీ!" అన్నది ఆమె తన పరిస్థితిని వివరిస్తూ.

"పుల్లలపాడులోనా!" అడిగాను నేను.

"అవునండీ!" ఆమె సమాధానం.

"ఉదయం 6 గంటల తరువాతే ప్యాసింజర్లుంటాయండి. లాస్ట్ బస్ ఒక పావుగంట క్రితమే వెళ్ళిపోయింది. ఉదయం 6 గంటల వరకూ ఎదురు చూడాల్సిందే అన్నా నేను.

ఆమె ఏమీ మాట్లాడలేదు. మౌనంగా నిలబడింది.

"అనకాపల్లి వరకైతే మీరు ఏ ఎక్స్‌ప్రెస్‌లోనైనా వెళ్లవచ్చు."

"నేను ఎట్టి పరిస్థితిలోనూ ఈ రాత్రి అర్జంట్‌గా పుల్లలపాడుకి చేరుకోవాలండీ. కండక్టర్ గారితో చెప్పి కొంచెం అక్కడ బస్ ఆపే ఏర్పాటు చేసి పెట్టండి సార్" అభ్యర్ధనగా అడిగింది.

అలా వీలుపడదనుకుంటాను అన్నాను. ఒక్క క్షణం ఆలోచించాను. నా వంతు సహకారంగా చిన్న సాయం చేసే ప్రయత్నం చేయాలనిపించింది.

"ఒక పని చేయండి. అవతల స్టేజి టికెట్ తీయండి. నేను ఎవరికైనా చెప్పి నా ప్రయత్నం చేస్తాను" అన్నాను.

"థ్యాంక్సండీ అంటూ" ఆ ప్రక్కనే ఉన్న బెంచీ మీద కూర్చుందామె.

అప్పుడు చూసానామెను పరిశీలనగా. 30 ఏళ్ళ వయసు ఉండవచ్చు. మోడరన్ డ్రస్ వేసుకుంది. జుత్తుని బిగించి కట్టి, ముడిగా వేసింది. వర్షపు జల్లులో తడవడం వల్లనేమో ఒంపు సొంపులు ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి.

**బి. రాంబాబు**

చాలా అందంగా ఉందామె. చేతిలో చిన్న సూట్ కేస్. చంకలో ఒక హ్యాండ్ బ్యాగ్, లిప్‌స్టిక్ వేసిన పెదవులు.

నాలో సంస్కారవంతుడు భుజం తట్టి చెప్పాడు... పరస్త్రీని అలా చూడకూడదని.

బస్ రాగానే చెప్తాలెండి... అంటూ అక్కడ నుంచి ఇవతలకు వచ్చాను.

చల్లటిగాలి వీస్తోంది. ఆకాశమంతా నల్లగా ఉంది. ఈ ప్రపంచమే ఒక వింత ప్రపంచం. నా 40 ఏళ్ళ జీవితంలో ఎంతమందిని చూడలేదు? భిన్న ప్రవృత్తులున్న మనుషులు వస్తారిక్కడకి. అవకాశవాదులు, పిసినారులు, స్త్రీలోలురు, వ్యసనపరులు, త్రాగుబోతులు, అమాయకులు, అతికోపిష్టులు... అందరూ ఈ స్టాండులోనే పది నిమిషాలుండి వెళ్ళిపోతారు. ఆ కొద్దిసేపట్లోనే తమ స్వభావాన్ని ప్రదర్శిస్తారు. కొందరు చిరాగ్గా, కొందరు మర్యాదగా, కొందరు మామూలుగా ఉంటారు. అవతల మనిషి తీరుని బట్టి మా ప్రవర్తన ఉంటుంది. నిజమే... అంతం లేని ఈ భవనమంతయుపురాతన పాంథశాల. ఈ బస్ షెల్టర్ ఒక పాంథశాలయే కదా... ఇలా సాగుతున్న నా ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టి నా క్యాబిన్‌వైపు వస్తున్నాను. ఆమె ప్రక్కన ఒక ముసలాయన కూర్చుని మాట్లాడుతున్నాడు. ఆ ప్రక్కనే కాస్త దూరంలో నిలబడి ఒక నడివయస్కుడు దువ్వెనతో తలను సరిచేస్తున్నాడు. నోట్లో కర్చీఫ్ వేలాడుతోంది. ఆ ప్రక్కనే ఓ కుర్రాడు అటూ ఇటూ తచ్చాడుతూ ఏదో పుస్తకాన్ని తిరగేస్తున్నాడు.

"నేనూ, అతగాడు కలిసి చదివాంలే. అప్పట్లో హైదరాబాదులో ఉండేవాళ్ళు. చాలా స్థితిమంతులు" అన్నాడా ముసలాయన.

"అవునండీ, ఇప్పుడు చితికిపోయారు" అందామె సమాధానంగా.

"నీకేం పర్వాలేదమ్మా. నేనున్నానుగా... ఏమీ భయపడకు. ఆమెతో మాట్లాడుతున్నా ఆమెని కాంక్షగా చూస్తున్నాయతని కళ్ళు. కావాలని చేతులను ఆమె శరీరం మీద తాకిస్తూ శునకానందాన్ని అనుభవిస్తున్నాడతను. భయపడాల్సింది ఎవరికీ కాదు. నీలాంటి గోమాయువులకే అనుకున్నాను మనసులో.

ఈయన మాకు తెలిసిన వారేనండీ... మా నాన్నగారి స్నేహితుడు. అంటూ నాకు అతన్ని పరిచయం చేసింది. తనకు తోడుగా మరొక వ్యక్తి ఉన్నాడనే ధైర్యం ఆమె మాటల్లో కనబడింది" ఆహా... అన్నాను. ఆపైన సీరియస్‌గా ఆ ముసలాడి వైపు ఓ చూపు విసిరి నా క్యాబిన్ లోకి వచ్చి చేరాను.

ఇంతలో ఒక బస్ కండక్టర్ వచ్చాడు. బస్ని షెడ్‌లోకి పంపి, నాకు ఇన్ఫర్మేషన్ ఇచ్చాడు. ఆపైన ఓ పావుగంటసేపు యూనియన్ విషయాలు మాట్లాడి నన్నొదిలాడు. ఫ్లాస్కులో టీ త్రాగి సిగరెట్ వెలిగిస్తూ బైటకు వచ్చాను. ఇదొక వ్యసనం. ఎంత మానుకోవాలన్నా మానుకోలేకపోతున్నాను. అందులోనూ నైట్ డ్యూటీ అయితే మరీ ఎక్కువ. మామూలుగా లెక్క ప్రకారం రోజుకు రెండో, మూడో కాలుస్తాను. ఈ డ్యూటీలో మరో మూడో నాలుగో ఎక్కువవుతాయి. అందుకే నైట్ డ్యూటీలు సాధ్యమైనంత తక్కువ వేయించుకుంటాను.

ఒక పెద్ద లౌడ్ స్పీకర్ లాంటి గొంతు నా ఆలోచనలకు భంగం కలిగించింది. ఆమె వైపు చూసాను. ఇందాక తల దువ్విన నడి వయస్కుడామెతో ముచ్చటిస్తున్నాడు. ఒక కాలిని కొద్దిగా వంచి, రెండు జేబుల్లో చేతులు పెట్టుకొని, విలాసంగా నిలబడ్డాడతగాడు. నేను వెళ్ళి అక్కడే

నిలబడ్డానతన్ని గమనిస్తూ.

ఆవిడేదో సమాధానం చెప్పింది.

“ఓ! ఐసీ! నేను మహీంద్రా & మహీంద్రా లో పనిచేస్తున్నానండి. నాది ఎక్కౌంట్ సెక్షన్. మా ఓనర్‌కి నేనంటే అమితనమ్మకం” అంటూ ఆ ఓనర్ గారి వ్యక్తిగత చరిత్రను వివరించడం ప్రారంభించాడు. ఆయన చిత్తు కాగితాలు అమ్మి ఈ స్థాయికి వచ్చాడనో, కాకా హోటల్ నుంచి కారెక్కే స్థాయికి ఎదిగాడనో అతగాడి సారాంశం. ఇదొక పెద్ద దురలవాటు. కొంతమందికి సరిగా మాట్లాడ్డం రాదు. ఎదుటి మనిషితో కాస్తంత పరిచయం కాగానే ఎక్కడెక్కడి విషయాలో ప్రారంభించి, ఆ పైన తమ స్వంత విషయాలను కథలు కథలుగా వినిపిస్తుంటారు. అవతల వాళ్ళ సహనానికి పరీక్ష పెడుతుంటారు. విడిపోయాకా ఎవరికెవరో మళ్ళీ కలుస్తారో లేదో. ఈ కొద్దిసేపట్లోనే ఈ చరిత్రలు వినిపించడం ఎందుకో?

నేను ఇవతలకు వచ్చి, సిగరెట్ ఆఖరి దమ్ము లాగి అవతల పడేసి క్యాబిన్‌లోకి రాబోతున్నాను.

“ఒక పని చేయండి. నేను ఇక్కడికి దగ్గర్లోనే ఉంటున్నాను. నా శ్రీమతి పుట్టింటికి వెళ్ళింది. వాళ్ళది విజయవాడలెండి. ఆవిడగారిని తీసుకు రావడానికి వెళుతున్నాను. మీకభ్యంతరం లేకపోతే ఈ పూట ఇక్కడ ఉండి, ఉదయమే వెళ్ళవచ్చు” అన్నాడతగాడు.

“ఈ రాత్రికి నాతో ఉంటావా?” అనే విషయాన్ని ఎంత డైరెక్ట్‌గా అడుగుతున్నాడు?

ఒంటరిగా ఆడది కనిపిస్తే చాలు... ఎక్కడ లేని ధైర్యం వస్తుంది మగ జాతికి.

ఈనాటి ద్వంద్వార్థపు మాటలున్న సినిమాలు, అశ్లీల వర్ణనలున్న కథలూ మనుషుల్ని ఏ రకంగా దిగజారుస్తున్నాయో కదా! ఈ నాగరికత మాటున ఎంత పశుప్రవృత్తి? ఎదుటి మనిషి రియాక్టయితే తప్పించుకోవడానికి అనుకూలంగా వింతగా మాటలు పేర్చాడితగాడు.

“లేదండీ. నేను అర్జంట్‌గా వెళ్ళాలి”.

“పర్వాలేదండీ. ఇప్పటికే 11 గంటలు దాటి 12 కావస్తోంది”.

మా ఇంటి ప్రక్కన ఎవరూలేరు. ఎవరూ పట్టించుకోరు కూడా.

ఉదయానే ఫస్ట్ బస్ ఎక్కిస్తాను కదా అన్నాడతను తప్పకరావలసిందన్నట్లుగా.

పర్వాలేదండీ సారీ. నేను తప్పక వెళ్ళాలి.

అది కాదండీ...

ఇలా సాగుతున్న సంభాషణను నేను గమనిస్తూనే ఉన్నాను. మర్యాద నుంచి బతిమిలాడుతూ ఆపైన దబాయించే స్థాయికి మారుతున్నాయి అతని మాటలు.

“ఏది కాదయ్యా. ఆమె అర్జంటుగా వెళ్ళాలంటే అలా సతాయిస్తావెందుకు” అన్నా నేను.

“అడిగేది నిన్ను కాదుగా? నీ జోక్యం ఏమిటి?” అన్నట్లు ఓ అసహనంతో కూడిన వాడిలా ఒక చూపుని నాపై విసిరి, ఆమె ప్రక్కన ఆ బెంచీ మీద కూర్చున్నాడతగాడు.

నాలో ఏవో ఆలోచనలు మొదలయ్యాయి.

మనిషి జీవితంలో సెక్స్‌కి ఎందుకింత ప్రాధాన్యత నిస్తాడు? ప్రతి వ్యక్తీ ఈ విషయంలో ఎంతకింత వ్యామోహ పీడితుడౌతాడు? మనిషిని ఆ కోరిక ఎందుకు పశువుగా *మారుస్తుంది?*

ప్రతిరోజూ పేపర్లో అమానుషంగా అనుభవించడం, బలాత్కరించడం, పరస్త్రీని వేధించడం వంటి సంఘటనలు ఎన్ని చదవడం లేదు? ఉన్నత పథాలకు వెళ్లాల్సిన ఈ వ్యవస్థ ఎందుకు పాతాళం వైపు పోతోంది? ఒంటరిగా స్త్రీ కనబడితే ఎందుకింత ఆబగా చూస్తారు? కాస్తంత అందచందాలను ప్రదర్శించే స్త్రీ కనబడితే ఎందుకింత రెచ్చిపోతారు? వయస్సుతో తారతమ్యం లేకుండా. ఎంత గొప్పవాడైనా, ఎంత నియమనిష్టలు గలవాడైనా, ఎంతటి మేధావియైనా పరస్త్రీ కాస్తంత అవకాశం ఇస్తే ఎందుకు వాళ్ళ జీవితాల్లోకి ప్రవేశిస్తాడు? ఇదేనా మగబుద్ధి అంటే?

ఎదుటి వ్యక్తి కష్టంలో ఉండి అర్థిస్తే సాయం చేయని వ్యక్తి, ఆ వ్యక్తి స్త్రీ అయితే అడిగీ అడగకుండానే సాయం చేస్తాడెందుకని? స్త్రీ అబల అనా లేక అవకాశం ఇస్తుందేమోనని ఆశతోనా? ఏమిటీ వింత ప్రవృత్తి? అందుకే అన్నాడొక మహానుభావుడు...

ఎంత నేర్చినా, ఎంత చూసినా, ఎంతవారలైనా కాంతదాసులే అని. నిజమే. ఈ విషయంలో ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ మానవ స్వభావం ఒక్కటిగానే ఉంది.

ఆఖరి సిగరెట్ తీసి వెలిగించాను. ఈ డ్యూటీకి ఇది చివరి సిగరెట్.

ఆలోచనలు నన్ను వదలడం లేదు.

అసలు మనం ఈ పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడడం వల్ల వచ్చిందేమో ఈ పరిస్థితి అనుకునే వాడిని. కానీ అమెరికా లాంటి విదేశాల్లో ఉన్న భారతీయులు ఎంతో దూరంలో ఉండడం వల్ల తమ అలవాట్లను, ఆచారాలను, సాంప్రదాయాలనూ అవసరమైనపుడు తప్పక అవకాశమున్నంతలో ఆచరిస్తున్నట్లు చదివానొక వ్యాసంలో. కానీ మనం మామూలు సమయాల్లో ఎలా ఉన్నా దేవాలయాల్లో పూజలు చేసేటప్పుడు కూడా ఫ్యాషన్ల పేరిట మిడ్డీలు, స్కర్ట్లు, పంజాబీలు, జీన్స్ వంటివి వేసి ప్రశాంతమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోలేక పోతున్నాం. పండుగ సమయాల్లో విపరీత ధోరణులున్న సినిమాలు ప్రదర్శించడం, చూడడం, సంక్రాంతి – దసరా పండుగలొస్తే ప్రతి కోవెలా దగ్గరా ఏదో ఒక సినిమా లేదా రికార్డింగ్ డ్యాన్స్. పొరపాటున ఎవరైనా ఓ హరికథో లేక బుర్ర కథో ఏర్పాటు చేస్తే ప్రేక్షకులు పదిమంది కూడా ఉండరు. ఈ ఫ్యాషన్ ప్రపంచంలో పడి, నాగరికత పేరిట వికృత చేష్టలను ప్రదర్శించడం ఎలా అలవాటైందో తెలియదు గానీ అది ఇప్పట్లో పోదు.

టీ తాగాలనిపించింది. ఎందుకో ఈ రోజు ఆలోచనలు కందిరీగల్లా బుర్రని తొలిచేస్తున్నాయి. క్యాబిన్‌లోకి వచ్చి ఫ్లాస్కులోని టీ ఒంపుకుని, చప్పరిస్తూ బైటకు చూసాను. ఆమె ప్రక్కన ఇందాక తచ్చాడిన కుర్రవాడు కూర్చుని ఉన్నాడు. అతడేదో చదివి వినిపిస్తున్నాడామెకు. నా కథకు ఏదైనా మంచి సన్నివేశం దొరుకుతుందనే ఉద్దేశ్యంతో అక్కడికి వెళ్ళాను.

*"ఓ చెలీ!*

*అప్పుడప్పుడూ అందించే చిరునవ్వు అప్పుగా ఇవ్వు*

*బారు వడ్డీయో, చక్ర వడ్డీయో*


*బిగి కౌగిలిగా ఇస్తాను*

*నా ప్రేమను మళ్ళీ మళ్ళీ"*

ఆవిడ పకపకా నవ్వింది.

ఆ కుర్రవాడామెవైపు ఆరాధనగా చూస్తున్నాడు"

మరొకటి వినిపించేదా? అన్నాడతను.




"ఆగు" అంటూ ఆమె అరచేతిని అతనివైపు ఉంచి పడీ పడీ నవ్వుతోంది. ఆమె అలా నవ్వుతూంటే ఆ కుర్రవాడి కళ్ళు ఆమె శరీరపు ఒంపు సొంపులను ఆస్వాదిస్తూ, కొలతలు కొలుస్తున్నాయని నాకవగతమైంది. తెల్లటి వైట్ ప్యాంటులోకి బ్లూ రంగు టీషర్ట్‌ను దోపి ఖరీదుగల షూ వేసాడు. ఈ మధ్యే వచ్చి, వెలుగుతున్న ఓ కుర్ర హీరో గారి హెయిల్ స్టయిల్‌ని అనుకరిస్తూ తలదువ్వాడు. దానికి తైల సంస్కారం జరిగి ఐదారు నెలలై ఉండవచ్చు.

"ఒక్క నీ కంటి చూపు చాలు.

వేయి ఓల్టుల కాంతి మాలలు"

చాలా బావుంది అంటూ భుజం మీద చేయి వేసి మెచ్చుకుందామె.

"ఏం చదువుకుంటున్నావు బాబూ!" అడిగానతన్ని.

"బి.ఏ. ఫైనల్" అన్నాడతను.

అతనిలో చాలా తెలివితేటలున్నాయి. మంచి భావుకత ఉంది.

కానీ ఆ వర్ణనలు వింటూంటే అతనిలో ఈ మధ్య కాలపు విపరీత ధోరణులు కనిపిస్తున్నాయి.

సరదాగా అతని సబ్జెక్ట్‌లో నాలుగు ప్రశ్నలు వేసాను.

సరియైన సమాధానాలు రాలేదు.

"పరీక్షలకింకా చాలా టైముందండీ. అప్పుడు చదువుతాను, నన్ను అమాయకుడిలా చూస్తూ అన్నాడతను.

నేనేమీ మాట్లాడలేదు. ఒక సీరియస్ లుక్ విసిరాను.

"అవునండీ... పరీక్షలపుడు నైట్ అవుట్‌లు చేసి ప్లాన్ ప్రకారం చదువుతాను. నేనెప్పుడూ ఫస్టే అన్నాడు మెరిసే కళ్ళతో."

"మీకింకా తెలియదు. చాలామంది అసలు చదవక స్లిప్‌లు పెట్టి రాస్తారు. కొంతమంది ఫీజులు కట్టి ఎగ్జామ్స్ వ్రాస్తారు. మా క్లాస్‌లో

చదివిరాసే వాళ్ళం ఓ పదిమందిమి ఉంటాం. అంతే... అందరి కంటే తనేదో బుద్ధిమంతుడై నట్లు చెపుతున్నాడు.

"ఏ ఊరు వెళ్ళాలి?" అన్నాను.

"దేరువాడ" అని చెప్పాడు.

"ఫస్ట్ షోకి సినిమాకు వెళ్ళానండీ. టిఫిన్ చేసి వచ్చేసరికి బస్ వెళ్ళిపోయింది. ఈ రాత్రి ఇక్కడే ఉండి, ఫస్ట్ బస్‌కు వెళతాను అన్నాడు సంజాయిషీగా. ఇందాక ఇద్దరికన్నా వీడు బెటర్. నిజాయితీగా నిక్కచ్చిగా తన మనస్సులో మాట చెపుతున్నాడు. వస్తానండీ" అంటూ లేచి వెళ్ళాడు.

నా చివరి ప్రశ్నకు కొంచెం గిల్టీగా ఫీల య్యాడనుకుంటా.

"పర్వాలేదు కూర్చో అన్నాను. నా క్యాబిన్ లోకి వచ్చి కూర్చున్నాను. డ్యూటీ రిపోర్ట్‌పై సంతకాలు పెట్టి, కాగితంపై ఏవో పిచ్చి బొమ్మ లు గీస్తూ కూర్చున్నాను. ఓ పావు గంట గడి చింది.

ఆమె ఒక్కతే అటు వైపు కూర్చుని ఉంది.

విజయవాడ బస్ క్యాన్సిలైంది.

గుంటూరు గాని, రాజమండ్రి గానీ 12 గంటలకు, 1 గంటకూ రావాలి.

రాజమండ్రి బస్ ఇంకా రాలేదు. అది వస్తే ఈవిడను ఎక్కించవచ్చు.

ఆవిడ కూర్చున్న బెంచీ వైపు చూసాను. ఒకతే కూర్చుని ఉంది. రండి టీ త్రాగుదురు అని అహ్వానించాను.

కాబిన్ దగ్గర కొచ్చి నిలుచుంది.

కూర్చోండి అన్నాను మర్యాదగా.

ఆవిడ నావైపు అదోలా చూసింది. ఆమె నన్ను కూడా అనుమానిస్తున్నట్లు కనబడింది.

"పర్వాలేదు రండి అంటూ టీ కప్పు అం దించాను.

నేను తల వంచి కాగితం మీద పిచ్చి గీతలు గీస్తున్నాను. ఆవిడ టీ త్రాగి కప్పు టేబుల్‌పై ఉంచింది. నేను తలెత్తి ఆమె వైపు చూసాను. ఆమె హ్యాండ్ కర్చీఫ్‌తో కళ్లు తుడుచుకుం టోంది. ఆమె బాధపడుతోందని అర్థమైంది.

నేను ఆమె వైపు తిరిగి చూడండి.... "బాధ పడడం కాదు... బాధపడవలసిన పరిస్థితి తెచ్చు కోకూడదు. మిమ్మల్ని మీరొక్కసారి చూసు కోండి. మీరు 30 దాటిన స్త్రీ. చక్కగా మన సంస్కృతిని ప్రతిబింబించేలా నిండుగా చీర కట్టుకుని, పైటను మెడ వెనుక నుంచి తీసి, ఇవతలి భుజం వైపుకు వేసుకుంటే మీకెంతో హుందాతనం వస్తుంది. మిమ్మల్ని చూస్తే ఎదు టి వారికెంతటి గౌరవం కలుగుతుంది? కానీ మీరు ఆ పంజాబీ డ్రెస్ వేసి, పెదాలకు లిప్‌స్టిక్ పెట్టి, ఐబ్రోస్ సవరించి, ముడిని అందంగా మడచి, ఒంపు సొంపులను ప్రదర్శించే విధంగా ఉన్నారు. అందులోనూ వర్షపు జల్లులో తడిచి వచ్చారేమో, ఎంతటి వాడైనా నిగ్రహాన్ని కోల్పో యేలా ఉన్నారు. మీవంటి స్త్రీలు నగ్నశిల్పా ల్లాగా మగవాళ్ళను రెచ్చగొట్టే విధంగా వేషం ధరిస్తే కన్నులు చెదరక మానవు. ఆ పైన కోర్కె రగిలి, ఆలోచించే సంస్కారం ప్రదర్శించేది ఎవరో ఒక్కరూ అరా. అందునా అర్ధరాత్రి. ఈ స్థితిలో ఒంటరిగా కనబడితే ఎవరైనా అంతే. మన సంస్కృతికి అనుగుణంగా ఏ వయస్సులో ఏ విధంగా ఉండాలో అలా అందంగా అలంక రించుకుంటే ఈ సమస్యలే రావు" అన్నాను. ఇందాకటి సన్నివేశాలు నాలో స్పందనలు కలు గజేసాయి. దాని ఫలితంగా ఆలోచనలు... అం దుకే ప్రవాహంలా నాలోని ఆవేశాన్ని మాటల రూపంలో ఆమెకు కొంచెం ఘాటుగానే వివ రించాను.

మా ఇద్దరి మధ్యా కొన్ని నిమిషాలు మౌనం రాజ్యం చేసింది. తరువాత ఆమె ప్రారంభించింది. చాలా ఆవేశంతో ఉంది.

"నేనేమీ సరదాగా అలంకారం కోసం వేసుకు రాలేదండీ... నాకు సమాజమంటే ఏమిటో, మనుషులంటే ఏమిటో తెలియదు. మేము చాలా ఏండ్లుగా కువైట్‌లో ఉంటున్నాం. అక్కడ మా మామగారు, నాన్నగారూ మంచి స్నేహితులు. కలిసి వ్యాపారం చేసారు. కాని మొన్న కువైట్ గొడవల్లో మా రెండు కుటుంబాలూ మాడి మసయ్యాయి. చివరగా మిగిలింది అవిటివాడైన నా భర్త, పసివాడైన నా బిడ్డ. ఉన్నదంతా వదిలి మేమిద్దరం అష్టకష్టాలు పడి మా వారి స్వగ్రామం పుల్లలపాడుకు వచ్చాం. ఆయన మంచంలోఉన్నారు. ఆయన్ని, నా బిడ్డనూ పోషించుకోవడానికి ఆధారం లేదు. భువనేశ్వర్‌లో నా చిన్ననాటి స్నేహితులుంటే అక్కడేదైనా ఆధారం దొరుకుతుందని వెళ్ళాను. ఓ ప్రైవేట్ కంపెనీలో ఇంటర్వ్యూ పూర్తి చేసుకుని తిరిగి వస్తున్నాను. నాకు సరైన డ్రస్ లేక వాళ్ళ డ్రస్ వేసుకున్నా. రిసెప్షనిస్ట్ అంటే ఎటువంటి అలంకారం చేసుకోవాలో మీకు తెలుసు కదా! ఇంటర్వ్యూ అయ్యేసరికి ఆలస్యమైంది. హడావిడిగా వచ్చి కదలబోతున్న రైల్లో ఎక్కాను. ట్రైన్ 4 గంటలు ఆలస్యమైంది. అందుకే ఈ రాత్రి పూట ఇక్కడ ఇరుక్కోవలసి వచ్చింది. ఆయన ఒక్కరే ఉన్నారు. బాబు చాలా చిన్నవాడు. నేను వెళ్ళకపోతే కంగారు పడతారు" మాటలు ఆపి ఆమె వెక్కి వెక్కి ఏడవసాగింది.

"చివరగా ఒక్క మాట... నన్ను నగ్నశిల్పంలా ఉండవద్దని అన్నారు. పట్టుచీరలో ఉన్నా, పరదాచాటున ఉన్నా చూసే కళ్ళల్లో వాంఛ ఉంటే నగ్నశిల్పంలాగే చూడగలరండీ... మేము నగ్నశిల్పంలా ఉండడం కాదు... పరస్త్రీల నగ్నత్వాన్ని మీ కళ్ళతో చూడకండి. అదే పదివేలు. భారతీయ సంస్కృతి అని మీరన్నారే? మరి "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" అన్ని పెద్దలు చెప్పారే! అది మరిచారా? లేదా పరస్త్రీని తల్లిగానో చెల్లిగానో చూసి తొలగిపోవాలని చెప్పారు గదా! అది గుర్తుకు రాలేదా? మారుతున్న నాగరికతతో పాటు వేష భాషలు మారవలసిందే. తప్పు లేదు. కాని సంస్కృతిలో అంతర్లీనంగా దాగి ఉండే మంచిని మనం వదలకూడదండీ... చూసే కళ్ళల్లో, మాట్లాడే మాటల్లో, ఆలోచించే మనస్సులో మంచి ఉంటే అంతా మంచిగానే ఉంటుంది. కానీ మంచి భావాలున్న మీరు కూడా అందరి మగవాళ్ళలాగా ఆలోచించవద్దు. ఇది నా మనసులోని మాట. నన్ను మరో విధంగా అనుకోవద్దు" మాటలాపి హఠాత్తుగా ఆమె బయటకి కదిలింది.

నేను హతాశుడినయ్యాను. ఒక వ్యక్తి హృదయపు లోతుల్లోకి తొంగి చూసిన నాకు హాయిగా ఉంది. ఇందాకటి ఆలోచనల్లేవు. ఏదో ప్రశాంతత నన్ను ఆవహించింది. మనస్సంతా ఒక రకమైన సంతృప్తితో తేలిపోయింది.

రాజమండ్రి బస్ కండక్టర్ వచ్చారు. అతన్ని రిక్వెస్ట్ చేసి ఒప్పించి, ఆమెని బస్ ఎక్కించాను యాంత్రికంగానే. ఆమెతో ఇంకేమీ మాట్లాడలేకపోయాను. నేను ఆమె వైపు చూసినపుడు ఆమె మౌనంగానే చేయి ఊపింది.

అంతలో ఆమె మొహంలో చిన్న చిరునవ్వు. "ఉంటానండి..." అని చేయి ఊపింది. బస్ కదిలింది.

జీవన ప్రయాణంలో ఇటువంటి గమ్యాలెన్నో, గమనాలెన్నో! కనిపించే వ్యక్తులెందరో! ఆలోచింపజేసే సంఘటనలెన్నో! మనిషి హృదయపు లోతుల్లోకి వెళ్ళి చూస్తే గానీ వాస్తవాలు బయటకు రావు. ●